క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ నిజాంపేట్, ఎస్ఎల్‌జీ, ఎంఎస్ఎస్, మా విల్లాస్ ఫీడర్ల పరిధిలోని బాచుపల్లి పోలీస్‌స్టేషన్, శ్రీకర విల్లాస్, బాచుపల్లి సిగ్నల్స్ నుంచి శ్రీకర విల్లాస్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

షిరిడీహిల్స్ ఫీడర్ పరిధిలో..

జగద్గిరిగుట్ట: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సబ్‌స్టేషన్ ఏఈఈ రాధా కిషన్ తెలిపారు. షిరిడీహిల్స్ ఫీడర్ పరిధిలోని రాజీవ్ హిల్స్, షిరిడీ హిల్స్, భూదేవి హిల్స్, కూనా మహాలక్ష్మీ నగర్, అంజయ్యనగర్ సీ బ్లాక్‌లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు



డ్రైనేజీ సమస్యను శంభీపూర్ కృష్ణకు వివరిస్తున్న స్థానికులు

దుండిగల్: యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేపడుతున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, దుండిగల్ కౌన్సిలర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట కేవీఆర్ వ్యాలీలో రూ.28 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా పనిచేస్తున్నామన్నారు. అనంతరం వార్డులో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఆర్కల జీతయ్య, తిరుమలేష్, శ్యామ్‌రావు, చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి, ధర్మారావు, శ్రీనాథ్, శ్రీధర్, నాగేశ్వరరావు, స్వామి, సందీప్, శివ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

సుభాష్‌నగర్: జాతీయ పోషణ సంబరాల్లో భాగంగా బహదూర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిరుధాన్యాల వాడకంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్పందన చిరుధాన్యాల్లో పోషక విలువలపై గర్భిణులు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

విడతల వారీగా పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

జగద్గిరిగుట్ట: విడతల వారీగా పెండింగ్ పనులు పూర్తి చేస్తానని కార్పొరేటర్ జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని సీసాలబస్తీలో గురువారం రూ.26 లక్షలతో డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. పెండింగ్‌లో ఉన్న పనులు ప్రారంభం కావడంతో బస్తీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హిందీ భాషా దినోత్సవం

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వనగర్‌లోని బచ్‌పన్ స్కూల్‌లో గురువారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ టి.కోటిరెడ్డి హిందీ భాష ఔనత్యాన్ని విద్యార్థులకు వివరించారు. జాతీయ భాషపై ప్రతి ఒక్కరూ మక్కువ పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు హిందీ భాషపై ప్రాముఖ్యతను వివరిస్తూ నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు కార్మికులే పునాది

చింతల్: పరిశ్రమలకు కార్మికులే పునాది అని.. ఇంజినీర్లు సైతం చేయలేనివి అనుభవంతో పూర్తి చేసే నేర్పరితనం కార్మికుల సొంతమని ఎంటీఏఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ యూనియన్ అధ్యక్షుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఐడీపీఎల్, బాలానగర్, షాపూర్‌నగర్‌లలో ఎంటీఏఆర్ యూనిట్లను సందర్శించిన ఆయన యాజమాన్యంతో మర్యాదపూర్వకంగా సమావేశమై కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం కార్మికులతో మమేకమైన రాజశేఖర్‌రెడ్డి జీతాలు, సదుపాయాల కల్పనలో న్యాయం జరిగేలా చూస్తానని పేర్కొన్నారు. ఎంటీఏఆర్ ప్రధాన కార్యదర్శి రాజయ్య, యూనియన్ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

హెల్త్‌కిట్ల పంపిణీ

కుత్బుల్లాపూర్: పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పారిశుద్ధ్య సిబ్బంది నిర్వహిస్తున్న పాత్ర ఎనలేనిదని కొంపల్లి చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బందికి సబ్బులు, నూనె, బెల్లం తదితర వస్తు సామగ్రిని అందజేశారు. పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. అందులో భాగంగానే ప్రతి నెలా కిట్లను అందిస్తున్నామని తెలిపారు. కమిషనర్ శ్రీహరి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్
- జంట సర్కిళ్లలో 3గంటల పాటు పర్యటించిన కమిషనర్
- జరుగుతున్న అభివృద్ధి పనులపై సంతృప్తి



పేట్‌బషీరాబాద్‌లోని అల్లం చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రోనాల్డ్ రాస్

కుత్బుల్లాపూర్: అభివృద్ధి పనుల విషయాల్లో సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని.. ప్రారంభం చేసుకున్న పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అన్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో గురువారం రెగ్యులర్ విజిట్‌లో భాగంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. పార్కుల ఆధునీకరణ, చెరువుల సుందరీకరణ, జంక్షన్లలో అభివృద్ధి వంటి పనులపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వంకాయలపాటి మమత కమిషనర్‌కు వివరించారు. సుమారు 3గంటలు సేపు వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు.

గ్రేటర్ కమిషనర్ పర్యటన ఇలా..

◆ జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్ సమీపంలో ఉన్న అల్లం చెరువు ఆధునీకరణ విషయంపై జరిగిన పనులను పరిశీలించారు. సుమారు రూ.1.5 కోట్లతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఇతర మొక్కలను నాటి సుందరీకరణ పనులు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత ఆధ్వర్యంలో పూర్తి చేశారు. మిగిలి ఉన్న చిన్న చితకా పనులను పూర్తి చేసి అందరికీ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

◆ చింతల్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి స్థలంలో రాంకీ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న సీఎన్డీ డెబ్రిస్ పనితీరుపై అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడారు. పూర్తయిన తర్వాత వాటి వినియోగంపై ఆరా తీశారు.

◆ రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్ చౌరస్తా సుమారు రూ.3.25 కోట్లతో జంక్షన్ అభివృద్ధి జరుగుతుండగా అక్కడ సందర్శించిన ఆయన పలు సూచనలు చేశారు. ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసి వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ మమతను ఆదేశించారు.



ఐడీపీఎల్ జంక్షన్‌లో అభివృద్ధి పనులను కమిషనర్‌కు వివరిస్తున్న జోనల్ కమిషనర మమత

◆ జీడిమెట్ల ఫాక్‌సాగర్ నీటి సామర్థ్యంపై ఆరా తీసిన గ్రేటర్ కమిషనర్ స్థానికంగా జరుగుతున్న నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులతో చర్చించారు. అక్రమ నిర్మాణాలు ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశించారు. చెరువులో నీరు రోజురోజుకు పెరుగుతూ రావడం మూలంగా కట్ట దిగువ ప్రాంతంలో ఉన్న వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కూకట్‌పల్లి జోనల్ ఎస్ఈ చిన్నారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కృష్ణ చైతన్య, గోవర్ధన్‌గౌడ్, ఉప కమిషనర్ నాగమణి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సాయిబాబా, హార్టికల్చర్ అధికారి రఘుపతిరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభయ్య, ఇంజినీరింగ్, ల్యాండ్, విద్యుత్, విభాగాల అధికారులు గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రాస్ వెంట ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట



ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజుకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తోందని, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎన్ని కోట్ల నిధులైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్సీ, ప్రభుత్వ ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్సీ పార్టీ కార్యాలయానికి చేరుకుని స్థానికంగా నెలకొన్న సమస్యలను ఏకరవు పెట్టారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిలో ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పించామన్నారు. రాబోయే రోజుల్లో సైతం తప్పకుండా ప్రతి ప్రాంతంలో దశలవారీగా పనులు చేపట్టే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి బెంచీల అందజేత

రంగారెడ్డినగర్: అంగన్‌వాడీకేంద్రాల్లో చదివే చిన్నారులకు సేవలందించాలనే లక్ష్యంతో రంగారెడ్డినగర్ ప్రాంత శెట్టి బలిజ సంక్షేమ సంఘం సభ్యులు చేయూతనందించడం అభినందనీయమని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు గుత్తుల మీరా కుమార్ అన్నారు. గురువారం రంగారెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రం-1లో శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో చిన్నారుల సౌకర్యార్థం సమకూర్చిన బెంచీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా మీరాకుమార్ మాట్లాడుతూ.. శెట్టిబలిజ సంఘ సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. అందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళాల ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కన్వీనర్ వాసంశెట్టి దుర్గాప్రసాద్ సలహాదారులు చలపతిరావు, రాంబాబు, అధ్యక్షుడు దొమ్మేటి సూర్య ప్రకాష్, ప్రధాన కార్యదర్శి విత్తనాల భాస్కరరావు, కోశాధికారి వాసంశెట్టి వెంకటేశ్వరరావు, సభ్యులు కొపిశెట్టి మురళి, వాసంశెట్టి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స



శస్త్రచికిత్స వివరాలను వెల్లడిస్తున్న హెల్త్ సిటీ చైర్మన్ భద్రారెడ్డి, డాక్టర్ స్వర్ణలత

సుభాష్‌నగర్: ప్రపంచ స్థాయి అత్యుత్తమ ఆరోగ్య సేవలను అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతూ మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి చరిత్రలో మరో మైలు రాయిని దాటిందని మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి అన్నారు. లైవ్ డోనర్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌తో మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు దుండిగల్ మున్సిపల్ బౌరంపేట్‌కు చెందిన నవీన్ కుమార్ అనే వ్యక్తికి రెండు కిడ్నీలు చెడిపోవడంతో అతని భార్య నీరజ డోనర్‌గా ముందుకు వచ్చారు. దీంతో ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రోగ్రామ్ ఇంచార్జ్ డాక్టర్ స్వర్ణ లత నేతృత్వంలో డాక్టర్స్ బృందం నవీన్ కుమార్‌కు విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించి డోర్ కిడ్నీని అమర్చారు. శస్త్ర విజయవంతం కావడంతో గురువారం ఆస్పత్రి ఆవరణలో విలేకరుల సమావేశంలో వైద్య బృందం సభ్యులు లైవ్ డోనర్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను వివరించారు. ఈ సందర్భంగా హెల్త్ సిటీ చైర్మన్ భద్రారెడ్డి, డాక్టర్ స్వర్ణలతలు మాట్లాడుతూ.. యాక్సిడెంట్ కేసుల్లో అవయవదానాలు చేసే విధంగా అవగాహన పెంచడంలో మల్లారెడ్డి ఆస్పత్రి యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. అవయవదాన ప్లాంటేషన్‌తో ఆస్పత్రి విజయపరంపర జాబితాలో చేరిందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి కొంపల్లి మున్సిపల్ యాదవ సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు గురువారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలపై వినతి పత్రాలు, ఆహ్వాన పత్రికలు అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారు.

◆ కొంపల్లి మున్సిపాలిటీకి చెందిన యాదవ సంఘం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వారిని సత్కరించారు. అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, ఉపాధ్యక్షుడు సన్న రాజుయాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్లు శ్రీనివాస్ యాదవ్, కృష్ణయాదవ్, మధుసూదన్, బీఆర్ఎస్ నాయకులు దేవేందర్ యాదవ్, వేణు యాదవ్, మహేష్ యాదవ్, గిరియాదవ్, మురళి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

కుత్బుల్లాపూర్: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని చెప్పి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బచ్చల కూర స్వామిమాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించి మాదిగ ఉప కులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌మాదిగ, యాదగిరి, రమేష్‌మాదిగ, నర్సింహులు, భూమయ్య, జ్యోతి, రాణి, సలోమి,స్వరూప, శశికళ దీక్షలో కూర్చున్నారు.

మర్యాదపూర్వక కలయిక



జీడిమెట్ల: మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకులు కూన శ్రీశైలంగౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం కిరణ్‌కుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లిన శ్రీశైలంగౌడ్ కాసేపు కిరణ్‌కుమార్ రెడ్డితో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని దీనికి బీజేపీ కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కిరణ్‌కుమార్‌రెడ్డి శ్రీశైలంగౌడ్‌తో అన్నారు. శ్రీశైలంగౌడ్ వెంట బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

2కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడ్డ గంజాయి విక్రయదారులు

కుత్బుల్లాపూర్: గంజాయి విక్రయాలు చేపడుతున్న నలుగురు వ్యక్తుల నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి అపర్ణపామ్ గ్రోవ్ గేటెడ్ కమ్యూనిటీ మెయిన్ గేట్ వద్ద నలుగురు వ్యక్తులు అనుమానంగా తచ్చాడుతుండగా విధుల్లో భాగంగా అటుగా వచ్చిన పోలీసులు వారిని ప్రశ్నించగా పొంతలేని సమాధానం చెప్పారు.వారిని సోదా చేయగా రెండు కిలోల గంజాయి పట్టుబడింది. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం, కాల్వ గ్రామానికి చెందిన అర్పిత్‌కుమార్(23), అపర్ణ పామ్‌గ్రోవ్‌లో ఉంటున్న నిర్మల్ జిల్లా లక్ష్మణ్‌చందా మండలం, వాద్యాల్‌కు చెందిన అట్ల వంశీరెడ్డి(23), శేరిలింగంపల్లి మున్సిపల్ తారానగర్‌కు చెందిన ముత్యం నితిన్ కుమార్ (25), బొల్లారానికి చెందిన రక్షిత్ పటేల్ (23)లు ముఠాగా ఏర్పడి కొంత కాలంగా గంజాయి విక్రయాలు చేపడుతూ వస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా సారంగపూర్‌కు చెందిన రాథోడ్ సుందర్ నుంచి రెండు నెలలుగా నితిన్, రక్షిత్, అర్పిత్‌కుమార్‌లు గంజాయిని కొనుగోలు చేసి నగరానికి చెందిన వంశీరెడ్డి ద్వారా పలువురికి విక్రయాలు చేపడుతూ వస్తున్నట్లు విచారణలో తేలింది. వారి వద్ద నుంచి 2కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

17న విశ్వకర్మ యజ్ఞం

రావాలని కూన శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వానం



కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద ఈనెల 17న విశ్వకర్మ యజ్ఞం నిర్వహించనున్నారు. గురువారం విశ్వబ్రాహ్మణ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బాల బ్రహ్మచారి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి యజ్ఞానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. విశ్వకర్మ యజ్ఞానికి తప్పక హాజరవుతానని తెలిపారు. అదే విధంగా ఆలయాభివృద్ధికి తన వంతు సహాయం ఎప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి కమ్మరి రాజు, కోశాధికారి రవీందర్ చారి, ఉపాధ్యక్షులు కృష్ణ చారి, ప్రవీణ్ చారి, రామ్మూర్తి చారి తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉలాస్లం

చింతల్: క్రీడలతో మానసిక ఉలాస్లంతో పాటు శరీరక దృఢత్వం పెంపొందుతుందని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ అన్నారు. చింతల్ హెచ్ఎంటీ గ్రౌండ్‌లో జరుగుతున్న 17వ రాజీవ్‌గాంధీ ఎన్ఎస్‌యూఐ స్పోర్ట్స్‌మీట్‌లో భాగంగా గురువారం మూడో రోజు మేడ్చల్ జిల్లాకు చెందిన 95 జట్లు వివిధ విభాగాల్లో పోటీపడ్డాయి. కబడ్డీ, క్రికెట్, వాటీబాల్, అథ్లెటిక్స్‌లలో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి గొల్లజాన్ మాట్లాడుతూ.. గెలుపోటములు సహజమని, ఓటమి పోటీతత్వాన్ని పెంచుతుందన్నారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ఐక్యతను పెంపొందించాలనే లక్ష్యంతో ఈ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాకేష్‌ముదిరాజ్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు సాయికిరణ్, నవీన్, అనూప్‌లు ఉన్నారు.

కాంగ్రెస్ విజయ భేరి సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ విజయభేరి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ శశికళ యాదవరెడ్డి అన్నారు. బౌరంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నాయకులకు పలు సూచనలు చేశారు. అనంతరం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ఎంతోమంది అమరవీరుల ప్రాణత్యాగాలను గుర్తించి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించిన మహాతల్లి సోనియమ్మ అని అన్నారు. సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి సుమారు 150 వాహనాల్లో 7500 మంది కార్యకర్తలతో సభకు తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.లక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, బండి శ్రీనివాస్‌గౌడ్, నవీన్‌రెడ్డి, యాదిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

11మంది జూదరుల అరెస్టు

దుండిగల్: పేకాట శిబిరంపై దాడి చేసిన ఎస్ఓటీ పోలీసులు పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు సమీపంలో ఉన్న ఇటుకల బట్టీ వద్ద కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు బాలానగర్ ఎస్ఓటీ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే సదరు శిబిరంపై దాడి చేసి 11మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి సుమారు రూ.50 వేలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వీరిని దుండిగల్ పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడిన వారిలో బీఆర్ఎస్ నేతలు ఉన్నట్లు సమాచారం. కాగా వివరాలను వెల్లడించకుండా దుండిగల్ పోలీసులు గోపత్య పాటించడం గమనార్హం.

చికిత్స కోసం వచ్చి లాడ్జీలో మృతి

కుత్బుల్లాపూర్: చికిత్స నిమిత్తం వచ్చిన ఓ వ్యక్తి లాడ్జి గదిలో మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పుప్పలగుట్ట ప్రాంతానికి చెందిన రావుల రాజేందర్(52) నగరంలోని అవంతి ఆస్పత్రిలో ట్రీట్‌మెంట్ చేయించుకునే నిమిత్తం గురువారం సుచిత్ర సర్కిల్‌లోని ఎస్‌వీఎస్ లాడ్జిలో దిగారు. లాడ్జి సిబ్బంది రాజేందర్ దిగిన గదిని శుభ్రం చేసేందుకు తలుపు తట్టినా ఎంతకీ తీయలేదు. దీంతో యాజమాన్యం గది తలుపులు తెరిచి చూడగా అపస్మారకస్థితిలో ఉన్న అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాలు రావాలంటే బీజేపీని గెలిపించాలి



ప్రగతినగర్ మూడు కోతుల చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు వచ్చాయని, రాష్ట్ర సాధనకు వెన్నుదన్నుగా నిలిచిన 20లక్షల మంది యువత మాత్రం నిరుద్యోగులుగా మిగిలారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. నిరుద్యోగ్య భృతి, ఉద్యోగాల భర్తీపై దీక్ష చేపట్టిన కేంద్రం మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం ప్రగతినగర్‌లోని మూడు కోతుల బొమ్మ సెంటర్‌లో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. 2018 ఎన్నికల ముందు హడావుడిగా 60వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసిన ప్రభుత్వం పేపర్ లీక్ కావడంతో అప్పటి నుండి ఉద్యోగాల భర్తీపై మీనమేషాలు లెక్కిస్తోందని ఆరోపించారు. పేపర్ లీకేజీలు చూస్తుంటే ప్రభుత్వమే కావాలని చేసినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. పేపర్ లీక్‌పై సీబీడీ కేసు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందంగా ఉందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వానికి బొంద పెట్టి బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మైనార్టీ మోర్చా అమలేశ్వరి, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రామచంద్రనాయక్, పార్లమెంట్ కో.కన్వీనర్ డాక్టర్ రాజు, కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి భిక్షపతి యాదవ్, నరేంద్ర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అరెస్టును ఖండిస్తున్నాం...



జీడిమెట్ల డిపో వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

జీడిమెట్ల: కేంద్ర మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ బీజేపీ నాయకులు జీడిమెట్ల డిపో వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా 130వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంది శ్రీరాములు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగులకు న్యాయం చేయాలని పోరాటం చేస్తున్న కిషన్‌రెడ్డి అరెస్టు రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. బూటకపు మాటలు, అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కద్దార్‌కు ప్రజల గోడు ఏమి తెలుస్తుందని ప్రశ్నించారు. అతి త్వరలోనే కేసీఆర్ పాలన కుప్పకూలడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన వారిలో బీజేపీ నాయకులు ఎంఎస్ వాసు, బుచ్చిరెడ్డి, చండి శ్రీనివాస్, గరిగె శ్రీనివాస్, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్టలో నిరసన..

జగద్గిరిగుట్ట: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ జగద్గిరిగుట్టలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ జేకే శేకర్ యాదవ్ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో గురువారం నిరసన తెలిపారు. ఎన్నో ఏళ్లగా ఉద్యోగాల కోసం వేచి చూస్తున్న నిరుద్యోగులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదరన్నారు. వారికి సంఘీభావంగా ఉపవాస దీక్ష చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.